క్లుప్తంగా

విద్యార్థికి చేయూత



విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కందుకూరు: మండల పరిధిలోని కటికపల్లికి చెందిన బుడ్డోల దేవేందర్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా కందుకూరుకు చెందిన ఎంఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మోటె రమేశ్ ఆదివారం అతని కుమారుల చదువుకు ఆర్థికసాయం అందించి ధైర్యం కల్పించాడు. వారికి అవసరమైన పుస్తకాలతో పాటు రూ.5వేల నగదు అందజేశారు. భవిష్యత్‌లో కూడా చదువుకోవడానికి సాయం చేస్తామని హామీనిచ్చారు. ఆయన వెంట ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు పాముల రవీందర్, జాయింట్ సెక్రటరీ పాముల మహేందర్, కోశాధికారి కందడి శ్రీనివాస్, సభ్యులు పి.సురేష్, వినోద్, ఎం.రాఘవేందర్, జి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

మాజీ మేయర్ పారిజాత



సంక్షేమ సంఘ నాయకులను సన్మానిస్తున్న పారిజాత

బడంగ్‌పేట్: కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాల నాయకులు పాటుపడాలని మాజీ మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 26వ డివిజన్ పోస్టల్ అండ్ టెలికాం కాలనీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, జనరల్ సెక్రటరీ చంద్రయ్యగౌడ్‌ను మాజీ మేయర్ సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జెల్ల రమేశ్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో కాలనీవాసులు

మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూడ న్యూగాయత్రీ నగర్ ఫేజ్–2లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.భాస్కర్, ఉపాధ్యక్షుడిగా విక్రం, ప్రధాన కార్యదర్శిగా భరత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రామకృష్ణ, కోశాధికారులుగా రంగనాయకులు, రజిని, సభ్యులుగా సునంద, నాగశ్రీ, హరిప్రకాశ్, ఎం.భాస్కర్, శ్రవణ్, యశ్వంత్, తేజలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కాలనీ అధ్యక్షుడు వంటేరు నర్సింహారెడ్డి తెలిపారు. దేవాలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మీర్‌పేట: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ 45వ డివిజన్ మాజీ కార్పొరేటర్ అక్కి మాధవి అన్నారు. ఆదివారం రాఘవేంద్రనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మెడివిజన్ కంటి ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు కంటి పరీక్షలు నిర్వహించారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తామని వైద్యుడు కృష్ణ తెలిపారు. వైద్య శిబిరానికి కాలనీవాసుల నుంచి స్పందన లభించిందని, ప్రతి ఒక్కరూ ఉచితంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాధవి సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కమలానగర్, శ్రీనివాసకాలనీ, రాఘవేంద్ర కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ హైకోర్టుకాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు. 11కేవీ పుష్పాగార్డెన్స్, ఇందిరానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు. 11కేవీ సామనగర్, దేశ్‌ముఖ్‌కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు.

వరద ముంపు తప్పేదెలా?

- రెండేళ్లుగా సాగుతున్న వరద కాలువ పనులు
- రాచకాలువపై అక్రమ నిర్మాణాలే పనులకు అడ్డంకి?



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో బృందావన్‌మేడోస్ కాలనీ వద్ద నిలిచిన వరద కాలువ పనులు

ఎల్‌బీనగర్: శాఖల మధ్య సమన్వయలోపంతో రెండేళ్లైనా వరదకాలువ పనులు ముందుకు సాగడం లేదు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి వరద ముంపు ఉన్న కాలనీల విముక్తి కోసం సుమారుగా రూ. 2 కోట్లతో నిర్మించే వరద కాలువ పనులు సగం ముందుకు సగం వెనక్కి సాగుతున్నట్లుగా ఉంది. ఈ సారైనా తమ కాలనీలకు వరద ముంపు నుంచి విముక్తి లభిస్తోంది అనే ఆశతో ఎదురు చూస్తున్న కాలనీవాసులకు నిరాశనే మిగిలింది. వానాకాలం వచ్చిందంటే చాలు..ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పలు కాలనీ ప్రజలు ముంపు భయంతో బిక్కుబిక్కుమంటు గడుపుతుంటారు. నాలాలు, కాలువలు, డ్రైనేజీ పొంగుతుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో ఇరిగేషన్, రెవెన్యూ, వాటర్ వర్క్స్, టౌన్ ప్లానింగ్ అధికారుల రాచకాలువను సర్వే చేసి హద్దులు సైతం నిర్ధారించినా పనుల్లో మాత్రం ఎలాంటి చలనం లేకుండా పోతుందని ఆ యా ప్రాంతాల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో కప్రాయి చెరువు నుంచి కిందికి వరద నీరు పారే రాచకాలువను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.కాలువపై నిర్మాణం చేసిన కట్టడాలను కూల్చితేనే వరద కాలువ పనులు సాఫీగా సాగుతాయి. అలాంటి కాలువపై నిర్మాణాలు కూల్చకుండా కాలువ పనులను ఎలా చేయాలని పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను ఆపేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో రాచకాలువ యథేచ్ఛగా ఆక్రమణలకు గురైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో రాచకాలువను సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

మునిగే కాలనీలు ఇవే..

వరద కాలువ పనులు జరిగితే ఇక ముంపు సమస్య ఉండదని భావించిన కాలనీ వాసులకు మధ్యలో ఆగిన కాలువ పనులపై ఆందోళన చెందుతున్నారు. నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, అంతర్గత డ్రైనేజీలో పూడికతీత చేపట్టకపోవడం ముంపు ముప్పు మరింత పెరుగుతోంది. మామూళ్లకు తలగ్గొడం, రాజకీయ ఒత్తళ్లు తదితర కారణాలతో కాలువపై నిర్మించిన ఆక్రమణలను తొలగించలేకపోతున్నారని పలువురు వాపోయారు. వర్షాకాలం వస్తే జక్కిడిరామస్వామికాలనీ, భవానీకాలనీ, ఏపీఆర్‌కాలనీ, బృందావన్‌మేడోస్ కాలనీ, మహాలక్ష్మీనగర్ కాలనీలకు మునక తప్పదని భయాందోళన చెందుతున్నారు.

హైడ్రాకు ఫిర్యాదు

రాచకాలువపై చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని హైడ్రాకు ఫిర్యాదు చేశామని ఇరిగేషన్ ఏఈ సతీష్ తెలిపారు. తాము చేసిన ప్రయత్నాలకు ఆక్రమణదారులు అడ్డుపడుతున్నారని అందుకే వరద కాలువ పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. దీంతో గత్యంతరం లేక ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశామని, త్వరలోనే హైడ్రా అధికారులు పర్యటించి కాలువను పరిశీలిస్తారని పేర్కొంటున్నారు.

కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తాం

ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి



26వ డివిజన్‌లోని పార్కును కాలనీవాసులతో కలిసి పరిశీలిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ గడ్డం ఎన్‌క్లేవ్, హనుమాన్‌నగర్ కాలనీల్లో ఆదివారం ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ అవుట్ లెట్ లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాలనీవాసులు ఆయన దృష్టికి తెచ్చారు. పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదని, వీధిలైట్లు, తాగునీటి సరఫరాలో జాప్యం ఉందని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. మాజీ మేయర్ పారిజాత దృష్టికి తీసుకెళ్లి కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో హనుమాన్‌నగర్ కాలనీ అధ్యక్షుడు నర్సింహాగౌడ్, కృష్ణ, రంజిత్‌రెడ్డి, రాజు, లచ్చిరెడ్డి, నాగిరెడ్డి, జంగారెడ్డి, రాకేశ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటుపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ గ్రామంలో జనావాసాల నడుమ సెల్ టవర్ ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజలు ఆదివారం నిరసనకు దిగారు. మామిడిపల్లి రోడ్డులోని చార్మినార్ మజీద్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ విషయమై మున్సిపల్, పోలీస్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలోని ఓ గ్రామంలో తీసుకున్న అనుమతుల పత్రాలను ఫోర్జరీ చేసి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నా వారిలో చలనం లేదన్నారు. ఇళ్ల నడుమ ఏర్పాటు చేస్తున్న ఈ టవర్ నుంచి రేడియోధార్మిక శక్తితో సంతాన సమస్యలు, హృద్రోగ సమస్యలు తలెత్తుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రోద్బలంతోనే రాత్రికి రాత్రి ఈ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. కాగా ఈ టవర్ విషయమై మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్, జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: రాజకీయాలకు అతీతంగా ఎల్‌బీనగర్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర పరిధిలోని శివంహిల్స్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్, పార్కులో బోర్‌వెల్ పంపుసెట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శివారు ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను దశలవారీగా పరిష్కరించానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, అనిల్ కుమార్, రామచంద్రారెడ్డి, నర్సింహ్మగౌడ్ శ్రీకాంత్, కాలనీవాసులు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లింగారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

‘భరోసా’ ఇవ్వకపోతే ఉద్యమిస్తాం

- ఎమ్మెల్యే సబితారెడ్డి
- మన్సాన్‌పల్లిలో బీఆర్‌ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు

మహేశ్వరం: మహేశ్వరం, కందుకూరు మండలాల కర్షకులకు రైతు భరోసా ఇవ్వకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆపదలో ఉండే వారికి అండగా ఉంటామని, ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల కల్లబొల్లి మాటలను నమ్మి అధికారం కట్టబెట్టారని ఎద్దేవ చేశారు. ఇప్పుడు వాస్తవాలను గమనించి కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలోకి వస్తున్నారని చెప్పారు. అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలకే ఇస్తున్నారన్నారు. రేషన్ కార్డుల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రతి ఇంట్లో మహిళలకు నెలకు రూ.2,500 సహాయం అందిస్తామని మాట తప్పారన్నారు. తులం బంగారం ఎప్పుడు ఇస్తారని విమర్శించారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కేఎల్లార్ ఒంటెద్దు పోకడలు, కష్టపడ్డ నాయకులను గుర్తించకపోవడం, తొందరపాటుతత్వంతో విసిగిపోయామన్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి నాయకత్వంలో త్వరలో జరిగే ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేస్తామని తెలిపారు. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యులు శంకరయ్య, శేఖర్, సత్యనారాయణ, నాయకులు కిరణ్, కుమార్, ప్రసాద్‌గౌడ్, మహేష్, మల్లేష్, రమేష్‌తో భారీ ఎత్తున యువకులు, మహిళలు ఉన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు జాన్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీనివాస్‌చారి, కృష్ణగౌడ్, సత్యనారాయణ, అశోక్‌గౌడ్, రాజునాయక్, యాదగిరిగౌడ్, సురేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న రాఘవేందర్‌రెడ్డి తదితరులు

ఘనంగా బొడ్రాయి పండగ



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు

హుడాకాంప్లెక్స్: గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో పూజించుకోవాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. సరూర్‌నగర్‌లో బొడ్రాయి 3వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సబితారెడ్డితో పాటు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డిసుధీర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలో కాలనీవాసులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రఘువీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: మన్సూరాబాద్ ప్రభుత్వ పట్టణ ఆసుపత్రి పక్కన రైట్ నక్షత్ర హాస్పిటల్స్, శ్రీరత్న క్లీనిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని మన్సూరాబాద్ బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వైద్యశిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

ఆమనగల్లు: ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్‌టీయూటీఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. సంఘం కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, సంఘం రాష్ట్ర నాయకుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డిలతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సదానందం మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాలతో రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. హెల్త్‌కార్డులు, పీఆర్‌సీ, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం సంఘం నాయకులు.. ఉద్యోగ విరమణ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాండు రంగారెడ్డి, నాయకులు పరమేశ్, గణేశ్, సుధాకర్, కృష్ణారెడ్డి, భార్గవి పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినా వాటికి మళ్లీ కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఎంపీ శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత భీమిడి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క పనికి పోటాపోటీగా బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు శంకుస్థాపనలు చేస్తూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరిస్తూ సమన్వయం చేసుకుని కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, ఎల్‌బీనగర్‌లో కొత్త సంస్కృతికి తెరలేపడం బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉండి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నర్సింహారెడ్డి, ఎర్ర మహేందర్, సర్వేష్, రవికుమార్, భాను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బీసీ రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు

కడ్తాల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వకుండా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ సన్నాహాలు చేస్తుందని పేర్కొన్నారు. బీసీలను మరోసారి మోసం చేయడానికి సర్కార్ పావులు కదుపుతుందని ఆరోపించారు. రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ఎన్నికలకు వెళ్లాలంటూ ఆదివారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్లు అమలు చేయకపోతే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు సిద్దిగారి దాసు, క్యామ వెంకటేశ్, మహేశ్, యాదయ్య, అంజి, సురేశ్, కుమార్, సురేశ్ తదితరులు ఉన్నారు.



జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంకల్పసభకు తరలిన బీజేపీ నేతలు



ఎల్‌బీనగర్: ప్రధాని మోదీ పాలన 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సికింద్రాబాద్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నిర్వహిస్తున్న సంకల్పసభకు బీఎన్‌రెడ్డినగర్ నుంచి బీజేపీ నేతలు తరలివెళ్లారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా నుంచి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికే గుర్తింపు

- పార్టీ బలోపేతానికి కృషి చేయండి
- స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: పార్టీ బలోపేతం కోసం శ్రమించే వారికి, ప్రజల్లో గుర్తింపు ఉన్నవారికి మాత్రమే స్థానిక ఎన్నికల్లో టికెట్లు లభించే అవకాశం ఉందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. యాచారం మండలం తమ్మలోనిగూడ గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ అయిలయ్యతో పాటు పలువురు పలువురు బీఆర్‌ఎస్ శ్రేణులు ఆదివారం నగరంలోని నివాసంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, కె.శ్రీనువాస్‌రెడ్డి, బీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు లక్ష్మీపతిగౌడ్, అరవింద్‌నాయక్, వెంకట్‌రెడ్డి, కర్రె బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మండల పరిధి పలు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ తెలిపారు. ఉదయం 11 గంటలకు మంతన్‌గౌరెల్లిలో ప్రారంభమై మాల్, నల్లవెల్లి, చింతపట్ల, తమ్మలోనిగూడ గ్రామాల మీదుగా ఎమ్మెల్యే పర్యటన కొనసాగు తుందని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే మోదీ లక్ష్యం

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, 11 ఏళ్లుగా ప్రధాని మోదీ సాధించిన విజయాలను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా నాయకుడు బండెల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం విఠాయిపల్లి గ్రామంలో వికసిత్‌భారత్‌లో భాగంగా నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నాయకులు నర్సింహ, లక్ష్మణ్, కృష్ణనాయక్, రాములునాయక్, రవిరాథోడ్, రాములు, జగన్‌రెడ్డి, సాయిబాబా, లక్ష్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.